సాక్షి
రంగారెడ్డి
శనివారం, 4, మార్చి, 2023

6న దివ్యాంగుల బస్‌పాస్ మేళా

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 6న ఉప్పల్ బస్టాండ్‌లో దివ్యాంగుల బస్‌పాస్ మేళా నిర్వహించనున్నట్లు ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మేళాకు హాజరయ్యే దివ్యాంగులు దరఖాస్తుతో పాటు, సదరం సర్టిఫికెట్, ఆధార్ ధృవపత్రం, పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటో తేవాలి. గుర్తింపు కార్డు కోసం రూ.50 చెల్లించాలి.



మహిళా కార్పొరేటర్లతో కలిసి నిరసన ర్యాలీలో పాల్గొన్న మంత్రి సబితారెడ్డి

న్యూస్‌రీల్

సేవా గుణాన్ని అలవర్చుకోవాలి



ట్రై స్కూటీని అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

షాబాద్: ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని జెడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. శుక్రవారం గిఫ్ట్ ఏ స్మైల్ కింద దివ్యాంగులకు ట్రై స్కూటీల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ కార్యాలయంలో అనితారెడ్డి చేతుల మీదుగా షాబాద్‌కు చెందిన వాజిద్‌కు స్కూటీని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో నిరుపేదలు, దివ్యాంగులకు సాయం చేస్తే జీవితంలో మరుపురాని ఆనందం కలుగుతుందని తెలిపారు. దివ్యాంగుల కోసం రూ.30 లక్షలతో జెడ్పీటీసీ అవినాష్‌రెడ్డి స్కూటీలు పంపిణీ చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సక్కు శ్రీనివాస్‌గౌడ్, జడల రాజేందర్‌గౌడ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ ముఖ్రంఖాన్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు రమేష్‌యాదవ్, శ్రీధర్‌రెడ్డి, మునీర్, నర్సింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఇమ్రాన్, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నర్సింహులు, రాంచందర్, అవినాష్‌రెడ్డి యువసేన సభ్యులు అజయ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉదయ

తలకొండపల్లి: తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లించినట్లైతే ప్రోత్సాహక రూపకంగా బ్యాంక్‌లు మరిన్ని రుణాలను అందజేస్తాయని శ్రీనిధి జిల్లా అధికారి ఉదయ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం శ్రీదేవి ఆధ్వర్యంలో 'శ్రీనిధి రుణాలు–రికవరీ' అంశంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉదయ మాట్లాడుతూ.. పొదుపు సంఘాల మహిళలందరూ శ్రీనిధి రుణాలతో స్వయం ఉపాధి పథకాలు, చిరు వ్యాపారాలు చేసి ఆర్థిక ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు. శ్రీనిధి ద్వారా తీసుకున్న బకాయి రుణాలను ఈ నెల 25లోగా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనిధి బ్యాంక్ మేనేజర్ మహేశ్, సీసీలు, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే పూర్వ వైభవం

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



హాత్ సే హాత్ జోడో యాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

హుడాకాంప్లెక్స్: కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రానికి పూర్వ వైభవం వస్తుందని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం హాత్‌సే హాత్ జోడో అభియాన్ యాత్ర సరూర్‌నగర్ డివిజన్ కొత్తపేట చౌరస్తాలో ప్రారంభమైంది. బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత, నియోజకవర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డితో కలిసి గడపగడపకూ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఏనుగు జంగారెడ్డి, బంగారు బాబు, ఆర్‌కేపురం, సరూర్‌నగర్ డివిజన్ల అధ్యక్షులు పున్న గణేశ్‌నేత, చిక్కుళ్ల శివప్రసాద్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, గట్ల రవీంద్ర, ధన్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.



గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ ఆమనగల్లులో కట్టెల పొయ్యిపై వంట చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తదితరులు

మోదీకి రిటర్న్ గిఫ్ట్ ఇద్దాం

- వచ్చే ఎన్నికల్లో గద్దె దింపుదాం
- గ్యాస్ ధరల పెంపుపై మంత్రి సబితారెడ్డి ఆగ్రహం

బడంగ్‌పేట్: గ్యాస్ ధరలు పెంచి మహిళలకు కానుకగా ఇచ్చిన మోదీని గద్దె దింపి రిటర్న్ గిఫ్ట్ ఇద్దామని విద్యాశాఖమంత్రి సబితారెడ్డి పిలుపునిచ్చారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ శుక్రవారం అల్మాస్‌గూడ నుంచి బడంగ్‌పేట వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలపై మోదీకి కనీసం కనికరం లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆసరా, రైతుబంధు, రైతులకు రూ.5లక్షల బీమా, దళితబంధు, కల్యాణలక్ష్మి తదితర పథకాలు ఇచ్చి జేబులు నింపుతుంటే.. ప్రధాని మోదీ గ్యాస్ ధరలు పెంచి జేబులు ఖాళీ చేస్తున్నారని మండిపడ్డారు. వంటింటి నుంచే బీజేపీ పతనం ప్రారంభం కావాలని, మోదీని చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. 'కట్టెల పొయ్యి ఇచ్చిపో.. గ్యాస్ బుడ్డి తీసుకుపో' అంటూ నినదించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, కార్పొరేటర్లు రామిడి కవిత, బోయపల్లి దీపిక, సంరెడ్డి స్వప్న, ఏనుగు రాంరెడ్డి, ముత్యాల లలిత, భీమిడి స్వప్న, లిక్కి మమత, పెద్దబావి శోభ, సూర్లగంటి అర్జున్, పవన్‌యాదవ్, శివకుమార్, బొద్రమోని రోహిణి, భారతమ్మ, డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటికి వెలుగు.. సిబ్బందికి దిగులు

ఒక్కో శిబిరానికి రోజుకు రూ.1,500 చొప్పున చెల్లింపు

- అయినా భోజనం, చాయ్‌బిస్కెట్లకు నోచుకోని సిబ్బంది
- తప్పని ఆకలి కేకలు.. వేతనాల కోసం వెతలు
- పట్టించుకోని అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'కంటి వెలుగు' కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా కొనసాగుతోంది. రోజుకు సగటున పది వేల మందికి కంటి పరీక్షలు చేస్తున్నారు. అక్కడికక్కడే రీడింగ్ గ్లాసులు అందజేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ ఇటు ప్రత్యక్షంగా ప్రజలకు సేవ చేస్తూ.. అటు పరోక్షంగా ప్రభుత్వానికి పేరు తెచ్చిపెడుతున్న క్షేత్రస్థాయి సిబ్బంది కనీస అవసరాలు మాత్రం పట్టించుకోవడం లేదు. ఉదయం, సాయంత్రం చాయ్‌బిస్కెట్లతో పాటు మధ్యాహ్న భోజనం సమకూర్చాల్సి ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం ఒక్కో క్యాంపునకు రోజుకు సగటున రూ.1,500 మంజూరు చేస్తున్నా సిబ్బందికి ఆకలికేకలు తప్పడం లేదు. కొన్నిచోట్ల స్థానిక సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు, దాతలు సమకూర్చుతుంటే.. మరికొన్ని చోట్ల స్వయంగా ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోంది. ఆరోగ్య కేంద్రం నుంచి మెడికల్ క్యాంపు నిర్వహించే ప్రాంతానికి సిబ్బందిని తరలించేందుకు ఆటోలు/కార్లు ఏర్పాటు చేసినట్లు చెబుతున్నా క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. సిబ్బందే స్వయంగా చేరుకుంటున్నారు.



డ్రాయింగ్ ఆఫీసర్లు, సూపర్ వైజర్లు కుమ్మక్కు!

జిల్లాలో 37 ఆరోగ్య కేంద్రాల పరిధిలో 80 కంటి వెలుగు స్క్రీనింగ్ క్యాంపులు కొనసాగుతున్నాయి. జనవరి 18 నుంచి శని, ఆది వారాలు మినహా అన్ని రోజుల్లో క్యాంపులు కొనసాగుతున్నాయి. ఒక్కో క్యాంపులో డాక్టర్ సహా ఆప్తమెట్రిషన్, నలుగురు ఆశాలు, ఇద్దరు డేటాఎంట్రీ ఆపరేటర్లు మొత్తం పది మంది పని చేస్తున్నారు. క్యాంపుల నిర్వహణ ఖర్చుతో పాటు సిబ్బందికి ఉదయం, సాయంత్రం చాయ్,బిస్కెట్లు, మధ్యాహ్నం భోజనం సమకూర్చనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. చాయ్, బిస్కెట్లకు రూ.40, మధ్యాహ్న భోజనానికి రూ.60 చొప్పున చెల్లిస్తోంది. ఇలా ఒక్కో సెంటర్‌కు రోజుకు రూ.1,500 చొప్పున చెల్లించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ముందే బడ్జెట్ సైతం విడుదల చేసింది. నిర్వహణ ఖర్చులను పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్/ డీడీ (డ్రాయింగ్ ఆఫీసర్) అకౌంట్లలో జమ చేసినట్లు తెలిసింది. వీరు క్యాంపు సూపర్‌వైజర్ పేరున చెక్కులు జారీ చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో పని చేస్తున్న ఏ ఒక్క సిబ్బందికీ భోజనం అందడం లేదు. చాలా మంది ఇంటి నుంచే భోజనం, తాగునీరు తెచ్చుకుంటున్నారు. ఆ అవకాశం లేని వారికి ఉపవాసం తప్పడం లేదు.

వేతనాల కోసం తప్పని వెతలు

కంటి వెలుగు క్యాంపుల నిర్వహణ కోసం ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఆప్తమెట్రిస్ట్ సహా డాక్టర్, డీఈఓలను తీసుకుంది. డిసెంబర్ 28న వీరంతా విధుల్లో చేరారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వీరికి 15 రోజుల పాటు శివరాంపల్లి కార్యాలయంలో శిక్షణ కూడా ఇచ్చారు. జనవరి 19 నుంచి క్యాంపులు ప్రారంభం కావడంతో ఆ రోజు నుంచి వారంతా ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇలా సుమారు 240 మంది వరకు తాత్కాలిక ప్రాతిపదికన పని చేస్తున్నారు. వీరు విధుల్లో చేరి రెండు నెలలు దాటినా.. ఇప్పటికీ వేతనాలు చెల్లించకపోవడంతో రోజువారీ ఖర్చుల కోసం ఇబ్బంది పడాల్సి వస్తోంది. బస్సు చార్జీలు, చాయ్, బిస్కెట్లకు కూడా పక్క చూపులు చూడాల్సి వస్తోంది. వేతనాలు ఏ రోజు ఇస్తారనే అంశంపై ఇప్పటికీ స్పష్టత లేదు. దీంతో ఆయా ఉద్యోగులంతా మూకుమ్మడి ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. క్యాంపులను బహిష్కరించి, వేతనాల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని భావిస్తున్నట్లు సమాచారం.

విచారణ జరిపిస్తాం

సిబ్బంది వేతనాలకు సంబంధించిన బిల్లును ఇప్పటికే మంజూరు చేశాం. ప్రస్తుతం ఈ–కుబేర్‌లో పెండింగ్‌లో ఉంది. రెండు మూడు రోజుల్లో క్లియర్ అవుతుంది. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా ఉద్యోగుల ఖాతాల్లోకి చేరుతాయి. క్యాంపుల నిర్వహణ ఖర్చులు, సిబ్బంది మధ్యాహ్న భోజనం ఖర్చులను కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభానికి ముందే సంబంధిత పీహెచ్‌సీల్లోని డీడీల ఖాతాల్లో జమ చేశాం. క్షేత్రస్థాయి సిబ్బందికి మధ్యాహ్న భోజనం సమ కూర్చడం లేదనే అంశం ఇప్పటి వరకు నా దృష్టికి రాలేదు. ఈ విషయంపై వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, డీఎంహెచ్‌ఓ



పెట్టుబడులు పెట్టింది ఈ కంపెనీలోనే..

ఆన్‌లైన్ మోసంపై దర్యాప్తు

- రంగంలోకి ప్రత్యేక బృందాలు
- మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు
- ఎంతమంది.. రూ.ఎన్ని కోట్లు మోసపోయారనే వివరాల సేకరణ
- బాధితులు ఏఏ అకౌంట్లలో డబ్బులు జమ చేశారని ఆరా..

యాచారం: ఆన్‌లైన్ మార్కెటింగ్ వలలో చిక్కుకుని మోసపోయిన బాధితులకు న్యాయం చేసే విషయంలో పోలీసులు నిమగ్నమయ్యారు. అధిక వడ్డీ ఆశతో యాచారం మండలంలోని 50 మందికి పైగా కోట్లాది రూపాయలు నష్టపోవడం.. మోసపోయిన బాధితులు గురువారం యాచారం పోలీసులను ఆశ్రయించిన విషయం తెలిసిందే.ఈ క్రమంలో పోలీసులు దర్యాప్తు వేగిరం చేశారు. మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్ పర్యవేక్షణలో ఇబ్రహీంపట్నం ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు, యాచా రం సీఐ లింగయ్య, మరో ముగ్గురు ఎస్‌ఐలు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఢిల్లీ కేంద్రంగా సాగిన ఆన్‌లైన్ మార్కెటింగ్‌లో యాచారం, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం తదితర మండలాల నుంచి పెద్ద సంఖ్యలో బాధితులు ఈ–స్టోర్ ఇండియా, కేపీ డబ్ల్యూ కంపౌండ్ అనే ప్రైవేట్ మార్కెటింగ్ సంస్థల ఖాతాల్లో ఆన్‌లైన్ (ఫోన్ పే,గూగుల్ పే)లో డబ్బులు జమ చేశారు. అధిక వడ్డీ ఆశతో రూ.కోట్లలో జమ చేసి మోసపోయారు. యాచారం మండలంలో వెలుగు చూసిన ఈ మోసంపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసేలా పోలీసులు రంగంలోకి దిగారు. ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించి మోసపోయిన బాధితులు ఎవరి ఖాతాల్లో ఆన్‌లైన్‌లో డబ్బులు జమ చేశారు,ఎన్ని రూ.కోట్లు జమ చేశారనే విషయాలపై పూర్తి విచారణ చేపడుతున్నారు. ఈ–స్టోర్ ఇండియా, కేపీ డబ్ల్యూ కంపౌండ్ ఆన్‌లైన్ మార్కెటింగ్ చేపట్టిన ఒకరిద్దరి ముఖ్యులను అదుపులోకి తీసుకుని విచారిస్తే పూర్తి వివరాలు బయటకు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. వారిని అదుపులోకి తీసుకోవడం కోసం రెండు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో గాలింపు చేపడుతున్నారు. ఒక్క యాచారం మండలంలోనే బాధితులు మోసపోయారా... లేదా మరే మండలంలోనైన ఆన్‌లైన్‌లో డబ్బులు జమ చేశారా అనే వివరాలు సేకరిస్తున్నారు.

రాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ

ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లాలో ఈనెల5న జరిగే అసిస్టెంట్ ఇంజనీర్, ఎంపీఎల్ ఇంజనీర్ టెక్నికల్ ఆఫీసర్, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్‌ల రాత పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పరీక్ష కేంద్రాలకు సంబంధించిన చీఫ్ సూపరింటెండెంట్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్‌సీ) ద్వారా పరీక్ష ఈ ఆదివారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాత పరీక్ష కోసం జిల్లా వ్యాప్తంగా 44 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను www.trprc.gov.in వెబ్‌సైట్ ద్వారా డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. హాల్ టిక్కెట్లలో అభ్యర్థి ఫొటో లేదా పేరులో ఏమైనా తప్పులుంటే మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోల మీద గెజిటెడ్ అధికారి సంతకంతో పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలన్నారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తుతో పాటు, ఫస్ ఎయిడ్ కిట్స్, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మందులతో పాటు, ఆశా వర్కర్ అందుబాటులో ఉండేలా చూడాలని వైద్య అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, టీఎస్‌పీఎస్‌సీ సెక్షన్ అధికారులు కె.వెంకటేశ్వర్‌రెడ్డి, టి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ

ఇక ఈజీగా కాలేజీకి..

- విద్యార్థులకు తీరనున్న బస్సు కష్టాలు
- రద్దీకనుగుణంగా అన్ని వైపులా సంఖ్య పెంపు
- అమ్మాయిల కోసం 'లేడీస్ స్పెషల్స్' సైతం
- ఉదయం, సాయంత్రం నేరుగా కళాశాలలకు రాకపోకలు
- ఘట్‌కేసర్, మేడ్చల్, ఇబ్రహీంపట్నం, దూలపల్లి రూట్‌లలో అదనపు బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: కళాశాలలకు వెళ్లేందుకు.. తిరిగి ఇంటికి వచ్చేందుకు సరైన సంఖ్యలో బస్సులు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు ఇది శుభవార్త. ఇకపై రద్దీకనుగుణంగా వివిధ మార్గాల్లో బస్సుల సంఖ్యను పెంచేందుకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది. నగరానికి నలువైపులా ఉన్న ఇంజనీరింగ్ కళాశాలలు, ఇతర ఒకేషనల్ విద్యాసంస్థల్లో చదువుకొనేందుకు ప్రతిరోజు లక్షలాది మంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. సకాలంలో బస్సులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా సరైన రవాణా సదుపాయం లేక విద్యార్థినులు మరిన్ని ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ క్రమంలో కొద్ది రోజుల క్రితం విద్యార్థుల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వివిధ మార్గాలపై సమీక్ష నిర్వహించారు. కళాశాలలు, విద్యార్థుల సంఖ్య, అందుబాటులో ఉన్న బస్సులు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రస్తుతం నగరానికి అన్ని వైపులా కాలేజీలకు వెళ్లే విద్యార్థుల కోసం ఆర్టీసీ అదనపు బస్సులను నడిపేందుకు కార్యాచరణ చేపట్టింది.



పెంపు ఇలా..

- ఎల్బీనగర్ నుంచి ఇబ్రహీంపట్నం వరకు 15 బస్సులను అదనంగా పెంచారు. అలాగే ఎల్బీ నగర్ నుంచి ఇబ్రహీంపట్నం గురునానక్ యూనివర్సిటీ వరకు ప్రతి రోజు 9 బస్సులు రాకపోకలు సాగిస్తాయి.
- బడంగ్‌పేట్, మిధానీ నుంచి ఇబ్రహీంపట్నం సెక్టార్‌లో 6 బస్సులను ఏర్పాటు చేశారు.
- దిల్‌సుఖ్‌నగర్, జేబీఎస్, ఎల్బీ నగర్ నుంచి అబ్దుల్లాపూర్‌మెట్, మజీద్‌పూర్ వరకు 6 బస్సులను అదనంగా ఏర్పాటు చేశారు.
- మెహిదీపట్నం నుంచి శంకర్‌పల్లి, మొయినాబాద్ వరకు 10 బస్సులను ఏర్పాటు చేశారు. శంషాబాద్ నుంచి వర్ధమాన్ ఇంజనీరింగ్ కాలేజీ వరకు 2 బస్సులు, మేడ్చల్, సుచిత్ర, మియాపూర్ నుంచి గండిమైసమ్మ వరకు 10 బస్సులను అదనంగా అందుబాటులోకి తెచ్చారు.
- ఈసీఐఎల్, ఉప్పల్ నుంచి ఘట్‌కేసర్ వైపు 11 బస్సులను, బోయిన్‌పల్లి, సుచిత్ర నుంచి మేడ్చల్ వైపు 7 బస్సులను ఏర్పాటు చేశారు.
- దూలపల్లి క్రాస్‌రోడ్స్ నుంచి బహదూర్‌పల్లి సెక్టార్‌లో మరో 7 బస్సులను, ఉప్పల్ క్రాస్ రోడ్స్ నుంచి ఆరాంఘర్ వరకు 2 బస్సులను అదనంగా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇంజనీరింగ్ కళాశాలలకు రాకపోకలు సాగిస్తున్న 85 బస్సులకు అదనంగా ప్రస్తుతం మరో 55 బస్సులను నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.
- ఈ బస్సులు ఉదయం 7.30 నుంచి 9.30 గంటల మధ్యలో, మధ్యాహ్నం 3.30 నుంచి 6 గంటల మధ్యలో అందుబాటులో ఉంటాయి.

లేడీస్ స్పెషల్స్..

- వివిధ రూట్‌లలో రాకపోకలు సాగించే విద్యార్థినుల కోసం ఉదయం, సాయంత్రం లేడీస్ స్పెషల్స్ నడిపేందుకు చర్యలు చేపట్టారు.
- ఉప్పల్ క్రాస్ రోడ్స్ నుంచి ఘట్‌కేసర్ మీదుగా బోగారం వరకు ఉదయం 8.10 గంటలకు, 8.30 గంటలకు రెండు ట్రిప్పులు అందుబాటులో ఉంటాయి.
- బోగారం నుంచి ఘట్‌కేసర్ మీదుగా సికింద్రాబాద్ వరకు సాయంత్రం 4.30 గంటలకు, 5 గంటలకు రెండు బస్సులు బయలుదేరుతాయి.
- ఎల్బీ నగర్ నుంచి ఇబ్రహీంపట్నం వరకు ఉదయం 7.35 గంటలకు, 8.35 గంటలకు రెండు బస్సులు ఉంటాయి. తిరిగి ఇబ్రహీంపట్నం నుంచి ఎల్బీ నగర్‌కు సాయంత్రం 4 గంటలకు, 4.15 గంటలకు మరో రెండు బస్సులను నడుపుతారు.
- ఎల్బీ నగర్ నుంచి ఇబ్రహీంపట్నం గురునానక్ వర్సిటీ వరకు ఉదయం 8 గంటలకు, 8.15 గంటలకు, తిరుగు ప్రయాణంలో సాయంత్రం 4.20, 4.30 గంటలకు రెండు బస్సులు ఉంటాయి.

టీఈఈ ఫామ్‌హౌస్ వెంచర్‌కు భూమిపూజ

- పాల్గొన్న ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

కందుకూరు: తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజనీర్స్ మ్యూచ్‌వెల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ (టీఈఈ) ఆధ్వర్యంలో మండలంలోని నేదునూరు గ్రామ పరిధిలో 60 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న ఫామ్‌హౌస్ వెంచర్‌లో శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమానికి ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు, జేఎండీ శ్రీనివాస్‌రావు, డైరెక్టర్లు సూర్యప్రకాష్, రాధాకృష్ణలతో కలిసి పాల్గొన్నారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎండీ ప్రభాకర్‌రావు తదితరులు

ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ఒకే చోట ఉద్యోగులంతా కలిసి గృహ నిర్మాణం కోసం భూమి కొనుగోలు చేయడాన్ని స్వాగతించారు. అందుకు చొరవ చూపిన సొసైటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఈలు గోపయ్య, రమేశ్, డీఈలు రాజారాంరెడ్డి, నర్సింహారెడ్డి, లక్ష్మీనారాయణ, మల్లేశం, బ్రహ్మం, సంపత్‌రావు, శ్రీధర్‌శెట్టి, స్థానిక సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డి, టీఈఈఏ అధ్యక్షుడు శివాజీ, ప్రధానకార్యదర్శి రామేశ్వరయ్యశెట్టి, వెంకట్రామయ్య, తిరుపతయ్య, ప్రవీణ్‌కుమార్, పున్నానాయక్, రవికుమార్, టీఆర్‌వీకేఎస్ అధ్యక్షులు జాన్సన్, వీఏఓఏటీ అధ్యక్షుడు అశోక్‌కుమార్, ప్రధానకార్యదర్శి అంజయ్య పాల్గొన్నారు.

ఇసుక డంప్ సీజ్



చుక్కాపూర్‌లో ఇసుక డంప్‌ను సీజ్ చేసిన అధికారులు

తలకొండపల్లి: అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును శుక్రవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. మండల పరిధిలోని చుక్కాపూర్‌లో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని పక్కా సమాచారం మేరకు ఆర్‌ఐ మంజుల ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది నిఘా పెట్టారు. గ్రామ శివారు ప్రాంతంలోని ఓ వ్యవసాయ పొలంలో ఇసుక డంపును గుర్తించారు. సుమారుగా రెండు లారీల వరకు ఉంటుందని, గుర్తించిన ఇసుక డంపును సీజ్ చేసినట్లు తహసీల్దార్ కృష్ణ తెలిపారు. బహిరంగ వేలం పాటల ద్వారా విక్రయించి, వచ్చిన రుసుము డబ్బులను ప్రభుత్వానికి జమ చేస్తామని తహసీల్దార్ చెప్పారు.

మోదీని గద్దె దించేవరకు పోరాటం ఆగదు

- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- సిలిండర్ ధరలను పెంచి సామాన్యులపై భారం
- మోదీ అసమర్థ పాలనతో ప్రజలకు అవస్థలు
- ఆమనగల్లులో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా



ఆమనగల్లులో కట్టెల మోపుతో నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీటీసీ అనురాధ

ఆమనగల్లు: ప్రధాని నరేంద్ర మోదీని గద్దె దించేవరకు పోరాటం ఆగదని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. సిలిండర్ ధరలను ఇష్టారాజ్యంగా పెంచుతూ సామాన్యులపై పెనుభారం మోపుతున్నారని ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలోని జాతీయ రహదారిపై శుక్రవారం మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్ ఆధ్వర్యంలో పెంచిన సిలిండర్ ధరలకు నిరసనగా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కట్టెల పొయ్యిపై వంటావార్పు నిర్వహించారు. ప్రజలకు సిలిండర్ బదులుగా కట్టెలే దిక్కు అంటూ కట్టెల మోపుతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలతో పాటు వంటగ్యాస్ ధరలను పెంచుతూ ప్రజలపై తీరని భారం మోపుతోందని మండిపడ్డారు. నిత్యావసర సరుకుల ధరల పెంపుతో సతమతమవుతున్న ప్రజలకు వంటగ్యాస్ ధరలను పెంచి సామాన్యుల నడ్డి విరిచిందని ఆరోపించారు. ప్రధాని నరేంద్రమోదీ తన మిత్రుడు అదాని కోసం ఆలోచించడం మాని పేద ప్రజల శ్రేయస్సు కోసం పనిచేయాలని సలహా ఇచ్చారు. 2014లో సిలిండర్ ధర రూ.50 పెంచితే రోడ్డెక్కి ధర్నా చేసిన ప్రస్తుత కేంద్రమంత్రి స్మృతి ఇరానీ..నాలుగేళ్లలో రూ.750 పెంచితే ఏం చేస్తుందని ఆయన ప్రశ్నించారు. మోదీ అసమర్థ పాలనతో ప్రజలు కట్టెల పొయ్యిపై వండుకునే రోజులు వచ్చాయన్నారు. 2014లో రూ.410 ఉన్న సిలిండర్ ధర ఇప్పుడు రూ.1,155 అయిందంటే అది మోదీ ప్రభుత్వ వైఫల్యమే అని విమర్శించారు. కార్యక్రమంలో ఆమనగల్లు జెడ్పీటీసీ అనురాధ, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నిట్టె నారాయణ, ఎంపీటీసీలు దోనాదుల కుమార్, సరిత పంతునాయక్, సర్పంచ్‌లు మల్లమ్మ, సోన శ్రీనునాయక్, ప్రేమలత, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ కమటం రాధమ్మ, బీఆర్‌ఎస్ నాయకులు చుక్క నిరంజన్‌గౌడ్, వస్పుల సాయిలు, తల్లోజు రామకృష్ణ, మల్లేశ్, గుత్తి బాలస్వామి, బీమయ్య, శివలీల, జయమ్మ, చుక్కమ్మ, కృష్ణవేణి, రమేశ్, వెంకటేశ్, భాస్కర్, శివకుమార్, అల్లాజీ, రమేశ్, రంజిత్, శేఖర్, ఆనంద్ పాల్గొన్నారు.

హవ్వ.. అధికార పార్టీ ఆందోళనలు చేయడమా?



శంకర్

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం పెంచిన సిలిండర్ ధరల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఆందోళనలు చేపట్టడం విడ్డూరంగా ఉందని పీసీసీ కార్యదర్శి వీర్లపల్లి శంకర్ విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పెరిగిన గ్యాస్ ధరలను తగ్గించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలే తప్ప ధర్నాలకు పిలుపునివ్వడం సిగ్గుచేటన్నారు. కేంద్రం విధించిన భారాన్ని తగ్గించి ప్రజలను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్రం వైఖరిపై అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు సిలిండర్లను నెత్తిన పెట్టుకొని ఆందోళనలు చేస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం చేతకాని తనానికి నిదర్శనమని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దొందూ దొందే అన్న చందంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీ అన్న చందంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా కేంద్రం పెంచిన గ్యాస్ ధరలను భరించి ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

వీధికుక్కల నియంత్రణకు చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ



వీధి కుక్కలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ

తుర్కయంజాల్: వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ తెలిపారు. శుక్రవారం పురపాలక సంఘం పరిధి రాగన్నగూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. వీధి కుక్కల పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. కుక్కల నియంత్రణకు బ్లూక్రాస్ సొసైటీతో ఎంఓయూ జరిగిందని.. ఇప్పటికే 660 కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్, స్టెరిలైజేషన్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, కౌన్సిలర్లు మంగమ్మ, అనురాధ, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రవేశ పరీక్ష

గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి



ప్రిన్సిపల్ రమాదేవి

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) 2023–24 సంవత్సరానికి గాను ఇంటర్ అడ్మిషన్‌కు నిర్వహించే ప్రవేశ పరీక్ష ఈ నెల 5న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రమాదేవి తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు మొయినాబాద్ మండల పరిధిలోని తోల్‌కట్ట గ్రామ సమీపంలో ఉన్న ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఒక రోజు ముందు పరీక్ష కేంద్రాన్ని చూసుకోవాలని సూచించారు. సీవోఈ కళాశాలలో అడ్మిషన్ పొందిన వారికి అకడమిక్ బోధనతో పాటు ఐఐటీ, నీట్, పరీక్షలకు సంబంధించి ప్రత్యేక శిక్షణ ఇస్తామని, అభ్యర్థులు ఇంగ్లిష్ మీడియంలో చదవాల్సి ఉంటుందన్నారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుందని వివరించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, వాటర్ బాటిల్, ఎగ్జామ్ ప్యాడ్, మాస్క్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. హాల్‌టికెట్‌లో ఏవైనా తప్పులుంటే విద్యార్థులు వారికి సంబంధించిన పాఠశాల నుంచి బోనఫైడ్ తెచ్చుకోవాలని పరీక్ష కేంద్రానికి ఉదయం 9 గంటలకే చేరుకోవాలని కోరారు.

బెడిసికొట్టిన వ్యూహం

అప్పు ఎగ్గొట్టేందుకు కిడ్నాప్, హత్యాయత్నం డ్రామా



ఇస్లావత్ రమేశ్

పహాడీషరీఫ్: తీసుకున్న అప్పును ఎగ్గొట్టేందుకు ఓ వ్యక్తి వ్యూహం బెడిసికొట్టింది. కిడ్నాప్, హత్యాయత్నం డ్రామా ఆడిన అతనిపై బాలాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ బి.భాస్కర్ కథనం ప్రకారం.. ఉప్పుగూడ సాయిబాబానగర్‌కు చెందిన ఇస్లావత్ రమేశ్ స్థానికంగా ఉంటున్న పెద్దయ్య అనే వ్యక్తి వద్ద మూడేళ్ల క్రితం రూ. లక్ష అప్పుగా తీసుకున్నాడు. కొంత కాలం తర్వాత డబ్బు తిరిగి ఇవ్వాలని పెద్దయ్య ఒత్తిడి తీసుకురావడంతో రమేశ్ కక్ష పెంచుకున్నాడు. ఎలాగైనా పెద్దయ్యను కేసులో ఇరికించి అప్పు నుంచి తప్పించుకోవాలని భావించాడు. ఇందులో భాగంగా ఫిబ్రవరి 28న ఆటోలో బాలాపూర్ దేవతల గుట్ట కమాన్ వద్దకు చేరుకున్నాడు. పక్కనే ఉన్న పొదల్లోకి వెళ్లి కాళ్లుచేతులు వైర్‌తో కట్టుకొని నోట్లో వస్త్రాన్ని పెట్టుకొని అరవడం ప్రారంభించాడు. అతని అరుపులు విన్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనాస్థలానికి చేరుకొని కట్లు విప్పారు. ఏం జరిగిందన్న విషయమై ఆరా తీశారు. పెద్దయ్య, అతని కుమారుడు సురేశ్ కిడ్నాప్ చేసి ఇక్కడికి తీసుకొచ్చారని.. తనను చంపేందుకు యత్నించారని ఫిర్యాదు చేశాడు. పెద్దయ్య కుమారుడి ఫోన్ నంబర్ లొకేషన్ పరిశీలించగా గుంటూరులో ఉన్నట్లుగా, అలాగే.. ఆర్‌సీఐ రోడ్డులో సీసీ కెమెరాలను పరిశీలించగా అతడు ఆటోలో దిగి నడుచుకుంటూ వెళ్లడం కనిపించింది. దీంతో కిడ్నాప్, హత్యాయత్నం రమేశ్ ఆడిన డ్రామాగానే పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

తూకాల్లో మోసం చేస్తే సహించం

కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి



చల్లా శ్రీకాంత్‌రెడ్డి

షాద్‌నగర్: పత్తి తూకాల్లో మోసాలకు పాల్పడుతూ రైతులను అన్యాయం చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. షాద్‌నగర్ ప్రాంతంలో పత్తి కొనుగోళ్లలో మోసాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తున్న జిన్నింగ్, వ్యాపారులపై తూనికలు కొలతల శాఖ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పత్తి తూకాల్లో మోసాలకు పాల్పడుతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో పత్తి రైతులు నష్టాలకు గురవుతుంటే మిల్లర్లు, వ్యాపారులు తూకాల్లో మోసాలు చేస్తూ రైతుల నుంచి మరింత దోచుకోవడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో కూడా పత్తి రైతులకు జరిగిన అన్యాయంపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కనీసం స్పందించలేదని అన్నారు. రెక్కాడితే కాని డొక్కాడని రైతులు ఎంతో కష్టపడి పంటను పండిస్తే వారికి మద్దతు ధర చెల్లించాల్సింది పోయి వారి నుంచి దోచుకోవడంతో రైతులు నష్టాల పాలవుతున్నారని పేర్కొన్నారు. దీంతో రైతులు వ్యవసాయం చేయాలంటేనే అప్పుల పాలవుతామని భయపడాల్సిన పరిస్థితి నెలకొందని చెప్పారు. రైతుల సంక్షేమానికి పాటు పడుతున్నామని చెబుతున్న ప్రభుత్వాలు రైతులను ఎందుకు ఆదుకోవడం లేదని, రైతులను మోసాలకు గురి చేస్తున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తూకాల్లో మోసాలు జరగకుండా చర్యలు తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు.

అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



చలో కలెక్టరేట్‌కు తరలుతున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మెలో భాగంగా శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చలో కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఐసీడీఎస్‌లో 40 ఏళ్లుగా పనిచేస్తున్న అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించాలని అనేక దఫాలుగా ప్రభుత్వంపై పోరాటాలను చేస్తూనే ఉన్నారన్నారు. గతంలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సీఎం కేసీఆర్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇతర రాష్ట్రాలలో అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని, మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలని కోరారు. అంగన్‌వాడీలకు ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బీస సాయిబాబ, నాయకుడు రాజశేఖర్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు జయమ్మ, సంగీత, ఊర్మిళ, భారతి, అనిత, శారదమ్మ, రోజా, రంగమ్మ, సక్కుబాయి, కరుణ, పద్మ, అనూష, చంద్రకళ, నిర్మల, జంగమ్మ, కవిత, గీత, స్వాతి, బాలమణి, ఇందిర, శాలిని, సుజాత, అరుంధ, శ్రీదేవి, రేణుక, రాధాదేవి, గిరిజ, ప్రమీల, సుజాత, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

గోదాం నిర్మాణానికి భూమి అప్పగింత

తలకొండపల్లి: పీఏసీఎస్ గోదాం నిర్మాణానికి అవసరమగు భూమిని డీసీఓ అసిస్టెంట్ రిజిస్ట్రార్ అధికారిణి శారదకు రెవెన్యూ అధికారులు అప్పగించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని 170 సర్వే నెంబర్‌లో ఒక ఎకరా భూమికి సంబంధించిన కలెక్టర్ అందజేసిన ప్రొసీడింగ్ పత్రాన్ని శుక్రవారం అందజేశారు. గతంలో సర్వే నంబర్ 6లో గోదాం నిర్మాణానికి భూమిని కేటాయించారని, ప్రస్తుతం ఆ భూమిని మార్చి.. సర్వే నంబర్ 170లో భూమిని కేటాయించినట్లు తహసీల్దార్ కృష్ణ తెలిపారు. మంజూరైన నాబార్డ్ నిధులు రూ.కోటి ఎనభై వేలతో గోదాం నిర్మాణం చేపట్టనున్నట్లు పీఏసీఎస్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, సర్పంచ్ లలిత, ఉపసర్పంచ్ అనిల్, రైతుబంధు మండల కోఆర్డినేటర్ నర్సింహ, సీఈఓ ప్రతాప్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ బాలవర్ధన్, మాజీ జెడ్పీటీసీ నర్సింహ పాల్గొన్నారు.